

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం,31 జులై 2025

8 పేజీలు


## ప్రజలకిచ్చిన ప్రతి హామీ
# నిలబెట్టుకుంటాం

**- భవిష్యత్తులో ఇంకా మెరుగైన సుపరిపాలన అందిస్తాం**

**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్కహామీ తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింతగా మెరుగైన సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం రామచంద్రపురం రూరల్‌లోని తాళ్ల పొలం, ఉట్రుమిల్లి గ్రామాల్లో ప్రజల వద్దకు నేరుగా వెళ్ళి కూటమిప్రభుత్వం ఏడాదిపూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రఅభివృద్ధి కోసం వివరించారు. ప్రజల యొక్క అభిప్రాయాలు తెలుసుకొని మై టిడిపియాప్‌లో వివరాలు పొందు పరిచారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, వృద్దులు, వితంతు వులకు 4వేలు, దివ్యాంగులకు 6వేలు,పూర్తి వైకల్యం ఉన్న వారికి 15వేలు,దీపంపథకంద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి 3ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామన్నారు. ఆగస్టులో అన్నదాతసుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రవేశం హామీలు నెరవేర్చుతున్నామన్నారు. ప్రతికుటుంబం సుఖ సంతోషాలతో ఉండేలా కూటమి ప్రభుత్వపాలన సాగుతుందని అన్నారు.గతప్రభుత్వంరాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా,

- తరువాయి 2లో..

## రాష్ట్ర ప్రగతి భావితరాల భవిష్యత్తు కోసమే
# కూటమి ప్రభుత్వం కృషి

**- శాసనసభ్యులు వనమాడి కొండబాబు**




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రగతి భావితరాల భవిష్యత్తు కోసమే కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, పని చేసే ప్రభుత్వానికి ప్రజల్ని విస్మరించిన దోపిడీదారులకు బేధాన్ని రాష్ట్రప్రజలుగుర్తించారని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండబాబు స్థానిక 14&15 డివిజన్ నందు పర్యటించి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ వివరాలను స్థానిక ప్రజలకు తెలిపారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ దేశంలో ఏనాయకుడు ఇవ్వని సంక్షేమం చంద్రబాబు ప్రజలకు అందిస్తు న్నారని, చంద్రబాబు నాయకత్వంలో ఏరాష్ట్రంలో లేనిసంక్షేమం రాష్ట్ర ప్రజలకు అందుతోందని, తల్లికి వందనం సాయం, పింఛన్ల పంపిణీలో చేతికి ఎముక లేకుండా ప్రభుత్వం ప్రజల సంక్షేమా నికి పాటుపడుతోందని, సుదీర్ఘ ప్రభుత్వం సమర్థ నాయకత్వంతోనే ప్రజలజీవితాల్లో మార్పులు చేకూర్తాయని, సమర్థవంతమైన నాయకత్వంతోనే పేదల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందని, రాష్ట్రం కూడా అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరదాడి శివ, అంగాడి దుర్గారావు, కామాడి సుబ్బారావు, పినపోతు రాము, కర్రీ నరసింహ మూర్తి, పినపోతుజీవరత్నం, పట్టా ధనలక్ష్మి, ఓలేటి పాండురంగడు,సేరుశ్రీనివాస్, పాలెపు రాజు,వనమాడికృపానందం, బలసాడి శ్రీను, పొన్నాడ లోకేష్ వర్మ, అరదాడి కాశి, కాలాడి కోటేశ్వరరావు, అంగడి రాంబాబు, పాలెపు దుర్గ రాజు, పెమ్మాడి దుర్గాప్రసాద్, పాలెపు మహాలక్ష్మి, మావుళ్ళ పాలెపు, పెసింగి శివభక్తిరాజు, సంగాడి వీరబాబు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి కందుల దుర్గేష్
# పర్యటన

**నిడదవోలు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరతపై మంత్రి కందుల దుర్గేష్ వారికి కేంద్రంలో స్టాఫ్‌నర్సుల కొరతఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆమేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించాడం జరిగింది. తాత్కాలికంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె.వెంకటేశ్వర రావు మంత్రి కందుల దుర్గేష్ వారికి వివరణ ఇవ్వడం జరిగింది.విధినిర్వహణ

- తరువాయి 2లో..

# ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

**-ఆర్‌ఎమ్‌సి శాఖాధిపతులతో సమీక్షలో కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ కమిషనర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్‌ఎమ్‌సి వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, నగరపాలక సంస్థ రెవెన్యూ ఆదాయాన్ని పెంచుకుంటూపోతే, ఆనగర అభివృద్ధిలో గణనీయమైన మార్పు దిశగా అడుగులు వేయడం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. గత ఏడాది ప్రాపర్టీ ట్యాక్స్ ద్వారా రూ.88 కోట్లు వసూలైందని, ఈ ఏడాది కనీసం 10 శాతంమేర పెరుగుదలసాధించాలని సూచించారు. హౌస్ టూ హౌస్ సర్వేను వారం రోజుల్లో పూర్తిచేసి,డిమాండ్ రైజింగ్‌ను చర్యలు ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ చివరకు 65 శాతం వసూళ్లు సాధించేలా లక్ష్యంతో ఇప్పటి నుంచే పనిచేయాలనిఅధికారులను ఆదేశించారు. నగరంలో మంజూరు అయిన అభివృద్ధి పనులనువేగంగా పూర్తిచేసి, ఆమేరకు అభివృద్ధిని ప్రజలకు

- తరువాయి 2లో..



# పిఠాపురంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలి

**- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ,

- తరువాయి 2లో..

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం రంపచోడవరం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా నిర్వహించింది. రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వసుధ ప్రారంభించారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ మాట్లాడుతూ ప్రతిఒక్కరు రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణాన్ని కాపాడిన దేవుళ్ళము అవుతామని పేర్కొన్నారు. అదేవిధంగా రక్తదానం చేసినవారికి మూడు, నాలుగు నెలలలోనే కొత్త రక్తం జనరేట్ అవుతుందని చెప్పడం జరిగింది. 22 మంది వాలంటీర్స్‌తో పాటు విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసిన విద్యార్థులను, ఈ శిబిరాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్, ప్రభాకర్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు , విద్యార్థులు, రంపచోడవరం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది డాక్టర్ ఎం.స్పందన, సత్తిబాబు పాల్గొన్నారు.

# అధికారులు మానవత్వంతో సమస్యలను పరిష్కరించాలి

– పాటంశెట్టి సూర్యచంద్ర



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** అర్హులైన లబ్ధిదారులు అందరికీ మానవత్వంతో ప్రభుత్వ పథకాలు అందించాలని పాటంశెట్టి సూర్యచంద్ర అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంచానికే పరిమితమైన ప్రతి ఒక్కరికి 15000 రూపాయలు యిచ్చి ఆదుకుంటామని ఎన్నికల్లో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చాలా స్పష్టమైన హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చాక సంబంధిత అధికారులు అనేక నిబంధనలతో అర్హులను నిరాశ పరుస్తున్నారని తెలిపారు. గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జాయింట్ కలెక్టర్ చినరాముడు గారి వద్దకు నూరు శాతం అంధత్వంతో కంటిచూపు కోల్పోయి పింఛన్ రాక అనేక అవస్థలు పడుతున్న గుమ్మల్లదొడ్డి గ్రామానికి చెందిన ఇంజరపు రాంబాబుని, మంచానికే పరిమితమైన అచ్యుతాపురం గ్రామస్తులు దివ్యాంగులు కోలా శివాజీ మరియు బండారు వెంకటరమణలకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని పాటంశెట్టి సూర్యచంద్ర జాయింట్ కలెక్టర్ చినరాముడు ని కోరగా స్వయంగా వారి పరిస్థితులు చూసి చలించిన జాయింట్ కలెక్టర్ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న అధికారులకు సూర్యచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారం

## 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:**2020 విద్యుత్ సంస్కరణల బిల్లులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకంపై స్మార్ట్ మీటర్లు భారాన్ని మోపడానికి ప్రయత్నిస్తుందని, దానిని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.బుధవారం ఉదయం ద్వారకా తిరుమలలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వర్తక, వాణిజ్య, ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ర పత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ చైతన్య, బికేయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని వారు కోరారు. అదాని స్మార్ట్ మీటర్లు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసే భారాలను తక్షణం విడనాడాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికే ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు,అదనపు ఇంధన చార్జీలు తదితర ఆరు రకాల చార్జీలను ప్రజలపై వేసి వేల కోట్ల రూపాయలు ప్రజల నుండి అన్యాయంగా వసూలు చేస్తుందని వారు విమర్శించారు. బి కే యం యు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాల యేసు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల వరకు గత ప్రభుత్వాలు ఉచితంగా కరెంటు అందించిన నేటి ఎన్డీఏ ప్రభుత్వం ఆ యొక్క రాయితీని తొలగించడం ఘోరమైన చర్య గా ఆయన పేర్కొన్నారు. ప్రజా వేదిక ఆధ్వర్యంలో ద్వారక తిరుమలలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు.

ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న భారాలను వ్యాపారస్తులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. ఆగస్టు 5వ తేదీ మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల సిపిఐ సహాయ కార్యదర్శి మాంద్రు బాలరాజు, బి కే యం యు ఏలూరు జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి రమేష్, ఎఐటియుసి నాయకులు పై శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కొప్పుల రామకృష్ణ, ఏపూరి వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యడ్లపల్లి సుబ్బారావు, బసవ పూర్ణ చంద్ర ప్రసాద్, గుదే ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకిచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటాం

మొదటిపేజీ తరువాయి

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. మంత్రి సుభాష్ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, హారతులు పట్టారు.కూటమి ప్రభుత్వ పాలన బాగుంది అంటూ కితాబు ఇచ్చారు. ఈకార్యక్రమంలో రామ చంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు, డీసీలు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కందుల దుర్గేష్ పర్యటన

మొదటిపేజీ తరువాయి

విషయంలో సిబ్బందికి సూచనలు చెయ్యడం జరిగిన నేపథ్యంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో పిహెచ్‌సి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో సూపర్వైజర్లు పాల్గొన్నారు. విధుల్లో అప్రమత్తంగాఉండాలని,సమయానికి హాజరు కావాలని, బోనాఫైడ్ హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. విధుల పట్ల నిబద్ధతపై ప్రతిజ్ఞ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగావిధులపట్లనిబద్ధతతో పనిచేస్తామనిసిబ్బంది వెల్లడించడమే కాక, అందుకు అనుగుణంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది. మంత్రి వెంట వైద్య ఆరోగ్య అధికారి ఎస్‌సిబ్బంది, స్థానికప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

మొదటిపేజీ తరువాయి

చూపించాలన్నారు. రోడ్ల నిర్మాణం, అందుకు సమాంతరంగా డ్రెయిన్ టూ డ్రెయిన్ పనులు జరగాలని సూచిస్తూ, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు త్వరగా పూర్తి అయ్యేలా వినిమయ నివేదికలను అందచేయాలని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్ష సందర్భంలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణం డిసెంబరులో పూర్తవుతుందని ఎస్ఈ పేర్కొన్నారు. సి అండ్ డి వేస్టును ప్రజలు మునిసిపాలిటీ గుర్తించిన ప్రదేశాలలో మాత్రమే పడవేయాలని, ఈ విషయమై సచివాలయ సిబ్బంది ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఆమేరకు పర్యవేక్షణ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అన్నా క్యాంటీన్ల నిర్వహణపై చర్చిస్తూ, లబ్ధిదారుల నుంచి ఆహార నాణ్యత, రుచి, శుభ్రతపై అభిప్రాయాలు ఎప్పటి కప్పుడు సేకరించాలని అధికారులకు తెలిపారు. అనంతరం శానిటేషన్, డీసిల్టేషన్ పనులపై పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షించారు. వీధి వ్యాపారుల జీవనోపాధి భద్రతగా ఉండేలా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ శాఖను ఆదేశించారు. రోడ్లపై అక్రమ వ్యాపారాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నాయన్న విషయం తమ దృష్టికి వొచ్చిందన్నారు. అలాంటి వాటికి సంబంధించి లైసెన్సులను రద్దు చేయాలని, పర్యవేక్షణ చెయ్యడం లో అలక్ష్యం వహిస్తున్నా వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. నగరపాలక సంస్థ సేవలపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరగాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, ఎస్ఈ ఎం.సీహెచ్. కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ వి. వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్. శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎం.డి. అబ్దుల్ మాలిక్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, సీఎంఎం రామలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో చర్చించారు, అలాగే కాకినాడ జిల్లాలో కేంద్ర విద్యాసంస్థలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# ఐటీ సెజ్‌లలో ఉద్యోగుల నివాస గృహాలకు స్థలాలు కేటాయించాలి

**- లోక్ సభ జీరో అవర్‌లో కేంద్రానికి విజ్ఞప్తి చేసిన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పార్లమెంట్ సమావేశాలు వేదికగా దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తనదైన శైలిలో గళమెత్తారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి) ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశవ్యా ప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్ఈజెడ్) లలో ఐ.టి ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ బుధవారం లోక్ సభ జీరో అవర్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. భారత్ ఐటీ సేవల ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని, 2005లో 23 బిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 200 బిలియన్ డాలర్లకి పెరిగి, 50 లక్షల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించి ందన్నారు. దేశవ్యాప్తంగా 351 ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో (ఎస్ఈజెడ్) 226 ఐటీ/ఐటీఈఎస్ కంపెనీలకు కేటాయించగా, బెంగళూరు, హైదరాబాద్, గురుగ్రామ్, పుణే, చెన్నై వంటి నగరాల్లో ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతు ందన్నారు.అయితే, ఈ క్లస్టర్లలో పనిచేసే లక్షలాది యువతీ, యువకులకు ప్రధానంగా నివాస సమస్య ఎదురవుతుందన్నారు. సెజ్ లు పట్టణాలకు దూరంగా ఉండడంతో గంటల తరబడి ప్రయాణ భారంతోపాటు అధిక అద్దెలు ఐటి ఉద్యోగులకు భారంగా మారుతున్నాయని, తద్వారా ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవ్వడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎస్ఈజెడ్ చట్టం ప్రకారం నివాస నిర్మాణాలకు అనుమతి ఉన్నప్పటికీ, జాతీయ స్థాయిలో స్పష్టమైన విధానాలు లేకపోవడం వల్ల అభివృద్ధి మందగిస్తోందని తెలిపారు. కేంద్రం దీనిపై దృష్టి సారించి ఐటీ/ఐటీఈఎస్ ఎస్ఈజెడ్ లలో లేదా సమీపంలో నివాస గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శ కాలు జారీ చేయాలని కోరారు. దీనివల్ల పట్టణాల్లో రద్దీ తగ్గడంతో పాటు మహిళా ఉద్యోగుల భద్రతకు ఆస్కారం కలుగుతుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# స్టాండింగ్ కౌన్సిల్‌గా ఆర్.కె.ఆచార్యులు



**కాకినాడ,మేజర్‌న్యూస్:** ఆర్.ఎన్.వి.ఎస్.కె.ఆచార్యులు (ఆర్.కె.ఆ చార్యులు)ను రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, మరియు అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియామకం ది. 29/07/2025న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు జివోఆర్టి నెం.244 తేదీ : 29/07/2025గా ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ అందించినారు.

మరియు నియామకం పట్ల ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ మరియు మునిసిపల్ శాఖామంత్యులు పి.నారాయణ, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబెర్ జ్యోతుల నెహ్రూ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం మరియు ఏ.పీ హైకోర్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.చిదంబరం మరియు సీనియర్ కౌన్సిల్ పి.గిరీష్ కుమార్ వీరి నిమాయకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్.కె.ఆచార్యులు స్వస్థలం కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామం మరియు వీరు హైకోర్టు న్యాయవాదిగా చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరి పేరు సిపారసు చేసేరు.

# 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**- చెక్కులు పంపిణీ చేసిన పిఠాపురం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ శాసన సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 12 మంది లబ్ధిదారులకు రూ. 6,85,027/- ( ఆరు లక్షల ఎనభై ఐదు వేల ఇరవై ఏడు రూపాయల) సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు పిఠాపురం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో కింతాడ అమ్ములు లబ్ధిదారునికి రూ. 1,29,426/-ల సిఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

పిఠాపురం పట్టణ మరియు పిఠాపురం మండలంలో ఎఫ్.కే పాలెం, జల్లూరు, మల్లం, విరవ, నర్సింగపురం, భోగాపురం, రాపర్తి, రాయవరం, వెల్దుర్తి గ్రామాలలో 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులను వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేసామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డా.బి.ఎన్.రాజు, పిల్లా శివశంకర్, ఏనుగంటి హరిబాబు, సురేష్, గ్రామస్థాయి అధికారులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, మరియు వీర మహిళలు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎటపాక మండల కేంద్రంలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

**- పలు సమస్యలను ఐటీడీ ఏపిఓ దృష్టికి తీసుకెళ్లిన జెడ్పిటిసి ఉబ్బా సుస్మిత**













**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ ఆధ్వర్యంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూనవరం, చింతూరు, వీఆర్ పురం మండలాల నుండి పలు సమస్యలపై ఐటీడీఏ పిఓ అపూర్వ భరత్‌కు వినతులు అందజేశారు. ఇందులో భాగంగా ఎటపాక మండల జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత మండలంలో వున్నా పలు సమస్యలను ఐటీడీఏ పీఓ అపూర్వ భారత్ దృష్టికి తీసుకెళ్లారు. ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకులపాడు, గుండాల, రాయనిపేట పంచాయితీలకు కలిపి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చెయ్యాలని, అదేవిదంగా మండలంలో రోడ్డుకు ఇరువైపులా అనుకోని ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని,మండల పరిధిలో గల ఆర్అండ్‌బి రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని, కొత్తూరు నారాయణపురం గ్రామానికి సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని, 2023-24లో సర్వే చేసిన ప్రభుత్వ భూమిని అర్హులైన వారికి పట్టాలు అందచేయ్యాలని మీకోసం కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి పీ ఓ అపూర్వ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎటపాక జెడ్పి టిసి ఉబ్బా సుస్మిత మాట్లాడుతూ ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చు కలపాడు, గుండాల, రాయణపేట పరిధిలో ఒక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని, ఈ గ్రామాల ప్రజలు సరైన వైద్యశాల లేక తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారని, కావున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని ఆమె కోరారు, ముఖ్యంగా గ్రామీణ రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మత్తులు చేపట్టాలని, కొన్నిచోట్ల రహదారు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, రహదారులులేని ప్రదేశాల్లో కొత్త రహదారులు నిర్మించాలని ఆమె అన్నారు.

# వెంకన్న ఆలయంలో ప్రసాదం తయారీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అన్న ప్రసాదం, లడ్డు, పులిహోర ప్రసాదాల తయారీ, ఆర్వో వాటర్ ప్లాంట్ తదితర కేంద్రాలను ఉభయగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జిఏబి నందాజీ, జిల్లా ఫుడ్స్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య బుధవారం పరిశీలించారు. ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, అన్న ప్రసాదం కేంద్రాలను సందర్శించి ప్రసాదాల తయారీ, అక్కడ ఉన్న సౌకర్యాలు పరిశీలించి తయారీదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం వారికి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఉన్నారు.

# అల్లవరం సిహెచ్‌సిని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం సిహెచ్‌సి ని డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, మరియు సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్.రామారావు, సూపర్వైజర్ ఎస్.సత్యనారాయణ సందర్శించి, సిహెచ్‌సి లో ఉన్న జ్వరపీడిత కేసులు, మలేరియా, డెంగ్యూ కేసుల గురుంచి వివరములు అడిగి తెల్సుకొన్నారు. అదే గ్రామంలోని మంచినీళ్ల చెరువు గట్టు ఏరియాకు వెళ్లి నీటి నిల్వలు, లార్వా పెరుగుదల నివారణ జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించినారు.

# గాయపడిన జర్నలిస్ట్‌కి ఆర్థిక సహాయం అందజేత



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాత్రికేయుడు అయ్యప్ప స్వామి భక్తుడుకి అయ్యప్ప స్వామి ఆత్మబంధు గ్రూప్ సభ్యులు మేమున్నామంటూ ఆర్థిక భరోసా ఇచ్చారు. రావులపాలెం గ్రామానికి చెందిన ఆకుల లోవరాజు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఆచంట తోట శివస్వామి అయ్యప్పస్వామి ఆత్మబంధు గ్రూప్ మరియు వారి స్నేహితుల ద్వారా సేకరించిన రూ.46,000లను శివగురు స్వామి రావులపాలెం సూర్యనారాయణ గురు స్వామి సమక్షంలో అందచేసారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి లోవరాజుకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాధించాలని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమములో నాగిరెడ్డి, శ్రీను రెడ్డి, రాజు, మణికంఠ పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్, పిఎసిఎస్ డిజిటలైజేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం

**– ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నలపై కేంద్రం సమాధానం**





**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నలపై కేంద్ర మంత్రులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహాయం, ప్రాధాన్యతలపై వివరించారు. ముఖ్యంగా నైపుణ్యాభివృద్ధి మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డిజిటలైజేషన్ రంగాల్లో రాష్ట్రానికి వచ్చిన మద్దతు గణనీయంగా ఉన్నట్లు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి రంగంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి ఇచ్చిన సమాచారం ప్రకారం, కాకినాడ సహా రాష్ట్రవ్యాప్తంగా ఫ్యూచర్ స్కిల్స్, డిజిటల్ టెక్నాలజీ శిక్షణపై స్పష్టమైన దృష్టితో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాకినాడలో ఇప్పటివరకు 192 మంది యువతకు ఫ్యూచర్ స్కిల్స్ శిక్షణ ఇవ్వబడింది. ఇందుకోసం రూ.13.20 లక్షల నిధులు ఖర్చు చేయగా, అభ్యర్థులు ఎఐ, మషీన్ లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో శిక్షణ పొందినట్టు పేర్కొన్నారు. పిఎంకెవివై 4.0లో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం ద్వారా యువతకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడం జరుగుతోందని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో గత ఐదేళ్లలో మొత్తం 10,078 మంది అభ్యర్థులు ఫ్యూచర్ స్కిల్స్ శిక్షణ పొందగా, ఇందుకోసం రూ.5.64 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 67 శిక్షణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. టూరిజం, ఆటోమోటివ్, టెలికాం, హ్యాండీక్రాఫ్ట్స్, పెట్రోకెమికల్స్ తదితర 36 రంగాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలపై అధ్యయనాలు నిర్వహించబడుతున్నాయి. విశాఖపట్నం – కాకినాడ పిసిపిఐఆర్ ప్రాంతానికి ప్రత్యేక పరిశ్రమ ఆధారిత శిక్షణ ప్రణాళికలు రూపొందించబడ్డాయి. అంతేకాక, రాష్ట్రంలో 356 పబ్లిక్ ప్రైవేట్ శిక్షణ కేంద్రాలు, 14 ప్రత్యేక శిక్షణ కేంద్రాలు స్థాపించబడ్డాయి. సిస్కో, మైక్రోసాఫ్ట్, ఐబిఎం, ఎడబ్ల్యూఎస్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాల ద్వారా యువతకు డిజిటల్ టెక్నాలజీలపై శిక్షణ అందించడమేకాక, స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ ద్వారా ఇంటర్నెట్ ద్వారా కూడా శిక్షణ పొందే అవకాశాలను కల్పించారు. అదనంగా, ప్రభుత్వ ఐటీఐల్లో ఎఐ ప్రోగ్రామ్మింగ్ అసిస్టెంట్ అనే కోర్సును ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు తాజా టెక్నాలజీ పరిజ్ఞానం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సందర్భంలో, పిఎసిఎస్ డిజిటలైజేషన్ అంశంపై ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2037 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. ఇందులో 2020 పిఎసిఎస్ లలో 30 జూన్ 2025 నాటికీ ఈఆర్‌పి వ్యవస్థ అమలులోకి వచ్చింది. మిగిలిన 17 పిఎసిఎస్ ల డిజిటలైజేషన్ పనులు కూడా 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని కేంద్రం స్పష్టం చేసింది. నాబార్డ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. డిజిటలైజేషన్ తరువాత పిఎసిఎస్ లు వ్యవసాయ ఇన్‌పుట్ పంపిణీతో పాటు రేషన్ పంపిణీ, తక్షణ బ్యాంకింగ్ సేవలు, రూపే–కెసిసి కార్డుల జారీ వంటి సేవలను అందించగలుగుతాయని పేర్కొన్నారు. డిసిసిబి లతో కలిపి ఈ వ్యవస్థ క్షేత్రస్థాయిలో సహకార రంగాన్ని మరింత సమర్థవంతంగా మార్చేందుకు దోహద పడుతుందని తెలిపారు.

# శ్రీ సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,57,08,001లు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో బుధవారం నాడు హుండీల ఆదాయాన్ని నిత్య కళ్యాణమండపంలో, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐ.వి.రోహిత్ సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో బంగారం 35 గ్రాములు, సిల్వర్ 659 గ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 125, మలేషియా రిగ్గిట్ 6, కువైట్ రియాల్స్ 21, సింగపూర్ డాలర్స్ 30, యూఏఈ దర్హాంస్ 90, కతార్ రియాల్స్2, ఒమన్ రియాల్ 5, కువైట్ డినార్ 21 మరియు మొత్తం రూ.1,57,09,001లు ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు తెలియజేశారు. ఈ లెక్కింపులో సేవకులు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# అమీనాబాద్‌లో మంగళవారం రాత్రి పల్లె నిద్ర

**– ఉద్యోగ ప్రకటనల పేరుతో మోసపోకండి**
**– ఎస్ఐ చిన్న బాబు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మంగళవారం రాత్రి జడ్డంగిపోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చిన్నబాబుగ్రామస్థులతో సమావేశమై పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కలిపించడం జరిగింది. ఉద్యోగాల పేరుతో మోసాలు ఎలా జరుగుతున్నాయో గ్రామస్తులకు వివరించారు. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని అలానే బాల్య వివాహాల వల్ల పిల్లల జీవితాలు ఎలా దెబ్బతింటాయో వివరించి, అలాంటి వివాహాలు నిరోధించాల్సిన అవసరాన్ని స్పష్టంగా వివరించారు. అలానే రైతులు పొలాలలో అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలను వివరించిఇలాంటి చర్యలను తక్షణమే మానుకోవాలని ఎస్సై చిన్న బాబు చూసించారు. రోడ్ భద్రత గురించి కూడా అవగాహన కల్పించివాహనాలను నిబంధనల ప్రకారం నడపడం, హెల్మెట్ వాడకం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి ఎంత ప్రమాదకరమో తెలిపారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఉపయోగం ఎలా ఉండాలో, ఎలా రిజిస్టర్ కావాలో, అత్యవసర సమయంలో ఎలా ఉపయోగించాలో వివరించడం జరిగింది., ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల తయారీ, నిల్వ, రవాణా లేదా వినియోగం వంటి కార్యకలాపాలలో పాల్గొనడం వల్ల తీవ్రమైన శిక్షలు ఉంటాయని వెల్లడించారు. అలాంటి నేరాలకు దూరంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించాలని ఎస్సై చిన్న బాబు కోరారు.

## జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి విరాళం




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన విష్ణుభట్ల నాగ కృష్ణ శ్రీనివాస్, ఉదయభారతి దంపతులు రూ.10,116లు ఆన్‌లైన్ ద్వారా అందించారు. దాతలకు అన్నదానం రసీదు, బాండ్, శ్రీ స్వామివారి చిత్రపటం, శ్రీ స్వామివారి ప్రసాదం పోస్టు ద్వారా పంపినట్లు ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు.

## మనసు బంగారం.. మురిసే భవితవ్యం

**– దత్తత కుటుంబాలను పరిశీలించిన ఆర్డీఓ శ్రీరమణి**



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4 బంగారు కుటుంబాలలో భాగంగా పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి పెద్దాపురం మండలంలోని కాండ్రకోట, పెద్దాపురం పట్టణం, వాలుతిమ్మాపురం గ్రామాలలో 3 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఆర్డీఓ శ్రీరమణి కాండ్రకోట గ్రామంలో దత్తత తీసుకున్న మామిడి చక్రమ్మ ఇంటికి వెళ్ళి ఆ కుటుంబ ఆర్థిక వృద్ధికి అవసరమైన, ఉపాధి మార్గాలకు సంబంధించి వివరాలను ఆర్డీఓ శ్రీరమణి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురంలో స్థానిక క్రిస్టియన్‌పేటలో మోర్త మరియ కుటుంబంతో పాటు వాలుతిమ్మాపురం గ్రామంలో కుక్కల చిట్టెమ్మ కుటుంబాలను ఆమె దత్తత తీసుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట వీఆర్వో సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ బషీర్, పీ4 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు ప్రమాణ స్వీకారం

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం నియోజకవర్గంలో మండలంలోని పులిమేరు గ్రామ విశాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షులుగా కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు మరియు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎమ్మెల్యే రాజప్ప సమక్షంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పిఏసిఎస్‌లు ఎంతో అభివృద్ధి చెందుతాయని, అలాగే పిఏసిఎస్‌ల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లుగా గోపు వల్లయ్య, బండ వెంకట్రావులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మండల టిడిపి అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, లింగంపర్తి పిఏసిఎస్‌ఛైర్మన్ పెంటకోట మోహన్, తుమ్మల నాని, నరాలశెట్టి బాబ్జీరావు, పచ్చిపాల సతీష్, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, కొప్పిరెడ్డి నాగబాబు, వెన్నా వెంకటేష్ (జనసేన మండల యూత్ ఉపాధ్యక్షులు), పిఏసిఎస్ సెక్రటరీ గుణ్ణం వీరవెంకట రమణ, పలువురు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వెదురు ఉత్పత్తుల ద్వారా మహిళల అభివృద్ధి





**– ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వెదురు ఉత్పత్తులు ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఏ సమావేశం హాలులో వెలుగు ఏపీడి, డిపిఎంలు, వెలుగు ఏపీఎం లు, వెదురు ఉత్పత్తుల రిజిస్ట్రేషన్ చేసుకున్న మహిళలతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, భారత ఇన్స్టిట్యూట్ పబ్లిక్ పాలసీ (ఐఎస్‌బి) సమావేశం ప్రాజెక్ట్ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వెదురు సేకరించడం, వెదురు పెంచడం, అదేవిధంగా సేకరించిన వెదురును వివిధ రకాలగా మార్కెట్‌కు పంపే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఏజెన్సీలో మహిళలకు వెదురు ఉత్పత్తులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వెదురు ఉత్పత్తులు తయారీ, వెదురు సేకరణ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, వెలుగు ఏపిడి దేగలయ్య, డిపిఎం పరమేశ్వరరావు, ఐఎస్‌బి కోఆర్డినేటర్లు సందీప్ చౌదరి, నాని బాబు, హేమంత్ కుమార్, ఏపీఎమ్‌లు అపర్ణ, దుర్గా ప్రసాద్, ఆదినారాయణ, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

## నేడుసోషల్ ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశం

**– ఎంపీడీఓ యాదగిరిశ్వరరావు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** 2024- 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులు పై సామాజిక తనిఖీ అధికారులు గురువారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి ఎల్. యాదగిరేశ్వరరావు తెలిపారు. ఈ నెల 31 మధ్యాహ్నం గం 2కు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజా ప్రతినిధులు, అధికారులతో సోషల్ ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు అవుతారని, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏ ఈ లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

# డాక్టర్ టివిఎస్ రంగారావుకి సన్మానం





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఎంఈఓ వన్‌గా పదోన్నతి పొందిన జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టివి ఎస్ రంగారావు నీ స్థానిక ఎన్జీవోస్ వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు జుత్తుక నాగేశ్వరరావు సాల్వతో సన్మానించినారు అనంతరం మాట్లాడుతూ జగ్గంపేట ప్రభుత్వం ఉన్నత పాఠశాలను తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపిస్తూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు ఆయన వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయింది విద్య పరంగా ఎంతో శ్రద్ధ చూపించి పిల్లలకు విద్యను క్రమశిక్షణ అందిస్తున్నారు అనంతరం టీవీఎస్ రంగారావు మాట్లాడుతూ ట్రాన్స్ఫర్ అయిన సిబ్బంది ఇప్పుడు వచ్చిన సిబ్బంది సహాయ సహకారాలతోటి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించాను ఎక్కడ ఉన్న జగ్గంపేట పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఘనముగా సన్మానించినారు . సేవలను కొనియాడినారు. ఈ కార్యక్రమ ంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వివిఎస్ ఎన్ మూర్తి దాడి బాబురావు వెన్న శ్రీనివా సులు ఎం కళ్యాణ చక్రవర్తి ఆర్ కళ్యాణ్ పైడిశ్వర్ వి నరసింహమూర్తి బి ప్రదీప్ కుమార్ డి పద్మావతి వి సూర్యకుమారి గంగాభవానిలు రామకృష్ణ బషీరుద్దీన్ జీ నాగమణి వాణి సుబ్రహ్మణ్యం విజయ్ కుమార్ తదితరులు పాల్గొని సన్మానించారు.

# పొలం పిలుస్తోంది



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మండలంలో పేరవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ మాట్లాడుతూ అరటి లో యాజమాన్య పద్ధతులను, పిలకలు ఎంపిక ,తెగుళ్ల నివారణ గురించి వివరించారు. అరటిలో దుంప పుచ్చు నివారణకు సుడో మోనాస్ శిలీంద్రాన్ని మొక్క మొదల్లో మొక్కకు 50 గ్రాముల చొప్పున మట్టిలో కలిపి వేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ తోటలలో కొమ్ము పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉద్యాన పథకాలను, బిందు తుంపర సేద్యంలో రాయితీ లను రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సింహాద్రి మాట్లాడుతూ వరి నాటే సమయంలో పాటించవలసిన మెలకువలను వివరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి పొలానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. వరి గట్లపై నాటుకోవడానికి కందుల విత్తనాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన రైతులు విత్తనాలు తీసుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో కర్రి సూర్యప్రకాష్,కర్రి సుబ్బారావు ,వేమగిరి ధర్మరత్నం సత్యానందం సూపర్వైజర్ రమేష్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి నివారణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** ప్రజలందరూ డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించుకొని, అందరూ కలిసికట్టుగా సహకరిస్తే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డా. తాడి రామగుర్రెడ్డి అన్నారు. వర్షాకాలంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు డెంగ్యూ వ్యాధి వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని డెంగ్యూ నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని రామగుర్రెడ్డి అన్నారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ (దిపిఎం పి అసోసియేషన్) తూర్పు గోదావరి జిల్లా అనపర్తి, బిక్కవోలు మండలాల ఆధర్యంలో మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన ఏరియా ఆసుపత్రి నుండి డెంగ్యూ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డా.తాడి రామగుర్రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రామ గుర్రెడ్డి మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం దోమ కాటువల్ల వస్తుందని దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, అలాగే ఇంటిముందు నీటి కుంటలు లేకుండా చూసుకోవాలని,దోమల ఆవాసాలను గుర్తించి ,రసాయనాలు చల్లి నిర్మూలించాలని సూచించారు .ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరికైన జ్వరం,వొళ్ళునొప్పులు ఎక్కువ ఉన్న,వొంటి పై దద్దుర్లు కనిపించిన వెంటనే దగ్గర్లో ఉన్న పీహెచ్సీలో చూపించుకోవాలని చెప్పినారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పద్మశ్రీ,డాక్టర్ తరుణ్,డాక్టర్ కోటేశ్వరి,డాక్టర్ ప్రవీణ,డాక్టర్ నిర్మలాచారి,మండల కార్యదర్శి ద్వారంపూడి సాయి రామారెడ్డి,కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, షేక్ సిలార్ సాహెబ్, పీ బాలసుబ్రహ్మణ్యం, ఐ శ్రీనివాస్, కేవీజీవీకే రెడ్డి, కేత సురేష్,నక్కిన రాజు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి



పెరవలి, మేజర్ న్యూస్ : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉన్నత పాఠశాలలను జూలై 30వ తేదీ బుధవారం సందర్శించి ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూటీయఫ్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణం పనుల్లో పురోగతి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి

**- కలెక్టర్ ప్రశాంతి సూచన**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అందరికీ గృహం" కార్యక్రమం కింద లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణాల లక్ష్యంలో దిగువ స్థానంలో ఉన్న ఐదు మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన అదనపు ఆర్థిక సహాయాన్ని గృహ నిర్మాణాల్లో సమర్థవంతంగా వినియోగించు కోవాలని, పనుల పురోగతిలో స్పష్టమైన మార్పు కనిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, రాజానగరం, కడియం మండలాల పరిధిలో అదనపు ఆర్థిక సహాయం పొందిన 704 మంది లబ్ధిదారుల్లో కేవలం 150 ఇళ్లు మాత్రమే రూఫ్ లెవెల్ దశను చేరుకున్నాయని తెలియజేస్తూ, ఈ పనితీరు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా లేదని ఆమె స్పష్టం చేశారు.

దిగువ స్థాయిలో ఉన్న మండలాల పనితీరు జిల్లా పురోగతిపై ప్రభావం చూపిస్తున్నట్లు తెలిపారు.స్వంత ఇంటి కలను సాకారం చేయడం ద్వారా ప్రజలకు భద్రతా భావన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం విడుదల చేసిందని, ఆయా మండలాలలో లబ్ధిదారు లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విధి విధానాలను వివరాలు తెలియ జేయాలని కలెక్టర్ సూచించారు.

అందుకున్న నిధులను సమర్థవంతంగా వినియోగించడంతోపాటు, నిర్మాణ పనుల పురోగతిని వేగవంతం చేయా ల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని చెప్పారు.గృహ నిర్మాణ దశల వారీ పురోగతికి అనుగుణంగా స్టేజ్ కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని, ఆయా దశల ప్రకారం బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇసుక, సిమెంట్ వంటి ముడి సరుకులు మరియు మౌలిక సదుపాయాలు అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈసమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు హౌసింగ్ ఇంచార్జ్ పిడి ఎస్. భాస్కర్ రెడ్డి, సంబంధిత మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నర్సింగ్ గ్రాడ్యుయేట్ల కొరకు ఉచిత శిక్షణ

**- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ (ఎస్ &టి), గిరిజన సంక్షేమం, సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ గ్రాడ్యుయేట్ల కోసం ఉచిత శిక్షణ మరియు ఉద్యోగావకాశాల కోసం భాష నేర్చుకోవడం పై ఆఫ్లైన్లో ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అన్ని కులాలకు చెందిన వారికి ఆన్లైన్లో ఉచిత శిక్షణ ఇస్తామని వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, రెండేళ్ల పాటు క్లినికల్ అనుభవం ఉండాలని, జీఎన్ఎం నర్సిం గ్ పూర్తి చేసి 3 ఏళ్లు క్లినికల్ అనుభవం ఉండాలని, వయసు 35 ఏళ్లు మించకూడదని స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయం త్రం 5.30 గంటల వరకు జర్మనీ భాషపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 8




నుంచి 10 నెలలు శిక్షణ తర్వాత బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని, ఆసక్తి ఉన్న వారు ఏపీ స్టేట్ నర్సిం గ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, అంతేకాకుండా ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్ కాపీ, క్లినికల్ అను భవం పత్రం ఉండాలని స్పష్టం చేశారు. ఇమెయిల్ ద్వారా రెజ్యూమ్ పంపేందుకు చివరి 7 ఆగస్టు 2025, skillinternational@apssdc.in, https:// naipunyam.ap.gov.in/user-registration pageR program-registration ఈ లింక్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 8639951441 నంబర్లో సంప్రదించాలని సూచించారు. తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం శిక్షణ కేంద్రాలలో శిక్షణ ఉంటుందన్నారు.

# యాంటీబయోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై అవగాహన, భారీ ర్యాలీ



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పోలీసు శాఖ, తూర్పుగోదావరి జిల్లా, ది రాజమండ్రి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్, ఈగల్ టీం ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం నగరంలో యాంటీబ యోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ మరియు సదస్సు నిర్వహించబడింది. జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పచ్చ జెండా ఊపి ప్రారంభ సూచన ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబ డుతోం దన్నారు. ప్రజలు, ముఖ్యంగా యువత, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్స్ వాడడం వలన ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, అందువల్ల అన్ని వర్గాలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే రెండు డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలు పనిచేస్తు న్నాయని, డ్రగ్స్కు అలవాటు పడిన వారికి ఈ కేంద్రాల్లో కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలిపారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయంపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై పీడీ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, వైద్యుల సూచనల మేరకు మాత్రమే మందుల విక్రయాలు జరగేలా చర్యలు తీసుకుంటామని, నిర్బంధిత నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), డీఎస్పీ (సెంట్రల్ జోన్), ఇన్స్పెక్టర్లు, డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు, నగరంలోని మెడికల్ షాపుల యాజమానులు, ది రాజమండ్రి హోల్సేల్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొ న్నారు. డ్రగ్ వినియోగంపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శించబడినాయి.

## గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నిర్మించిన పెద్దాపురం లలిత ఎంటర్ప్రైజెస్

**- ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక గోకవరం రోడ్డులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పెద్దాపురం లలిత ఎంటర్ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లలిత ఎంటర్ప్రైజెస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టె శ్రీనివాస్, లలిత ఎంటర్ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టి ఆదిశంకర్ హాజరై వాటర్ ప్లాంట్ విద్యార్థినిలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మట్టే శ్రీనివాస్, ఆదిశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురుకుల పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అడగడం జరిగిందని వెంటనే ఏర్పాటు చేశామని ఇంతమంది పిల్లలు ఇంత ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటున్న మీకు ఉన్నత చదువులకు మీకు అన్ని విధాల సహకరించడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసే మట్టే సోదరులు అడిగిన వెంటనే ఈ గురుకుల పాఠశాలకు మంచినీటి సౌకర్యం కల్పించడ మే కాకుండా బాలికల ఉన్నత చదువులు చదువుకోవడానికి సహకరిస్తామని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని వీరు జగ్గంపేటలో డిగ్రీ కళాశాలకు ఆర్వో ప్లాంట్ ఇవ్వడం, కృష్ణవరం గ్రామంలో ఈరోజు మరో ప్లాంట్ ప్రజలకు అందించడం జరుగుతుందని, అన్నవరంలో కళ్యాణమండపం ప్రసాదం తయారు చేసే భవనం నిర్మించారని వీరు చేస్తున్న సేవలకు గుర్తించిన ప్రభుత్వం అన్నవరం శాశ్విత బోర్డ్ మెంబర్గా అవకాశం కూడా కల్పించడానికి సిద్ధమవుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ విజయ క్లారిస్ కుమారి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తిరుమలరాజు మురళి రాజు, బద్ది సురేష్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

**నరసాపురం, మేజర్న్యూస్ :** స్థానిక చినమామిడిపల్లి రైల్వే గేటును మూసివేసి నరసాపురం భీమవరం వెళ్ళు వాహనములకు రైల్వే స్టేషన్ పక్కన నుండి డైవర్షన్ ఇచ్చినటువంటి ప్రదేశంలో చినమామిడిపల్లి గ్రామస్తులకు అటు ఇటు వెళ్ళు వారికి దూరం అయినందున చుట్టూ తిరుగుతూ రావాలంటే ప్రజల తీవ్ర ఇబ్బంది పడుతున్నందుకు మూసివేసిన రైల్వే గేటు పైనుండి ఫుట్ ఓవర్ బ్రిడ్జి పాదచారులు టూ వీలర్స్ వెళ్ళు విధంగా బ్రిడ్జిని నిర్మించుటకు రైల్వే అధికారులు ఆమోదించారు.

బ్రిడ్జినిర్మాణమునకు ప్రతిపాదనలు పంపు నిమిత్తం రైల్వే శాఖ నుండి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో బ్రిడ్జి పనులు మొదలెట్టుటకు అనుమతులు లభించినందున బుధవారం ఆర్డీవో దాసి రాజు, భీమవరం రైల్వేడి ఈ అందే శంకర రామాంజనేయులు ఇరిగేషన్ డిఈ మోహన కృష్ణ, ఆర్అండ్బి ఏఈఈ ప్రసన్న బాబు, తహసిల్దార్ ఐ.వివి సత్యనారాయణ, ఆర్అండ్బిడి టీఎస్ కృష్ణ కుమార్ డ్రైన్స్ ఏ ఈ.పావని, నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టారు జి మధు బాబు తదితరులు పరిశీలించారు. వంతెన నిర్మాణమునకు త్వరలో టెండర్లు కు రంగం సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామాంజనేయ రాజు, స్థానిక కౌన్సిలర్ పాలూరి బాబ్జి, గుని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున చేరి సమస్య త్వరలో పరిష్కరించాలని కోరారు.

# తుమ్మలోవ ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన కలెక్టర్ పి.ప్రశాంతి

**– ఫస్ట్ రిఫరల్ యూనిట్ అభివృద్ధికి తగిన ప్రణాళికలతో ముందుకు రావాలని అధికారులకు సూచన**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ మరియు మునిసిపల్ కమిషనర్ పి.ప్రశాంతి బుధవారం తుమ్మలోవ ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల నాణ్యతను ఆమె సమీక్షించి, పలు వార్డులు, పరికరాలు, రికార్డులు, మందుల నిల్వలు, టెస్టుల నిర్వహణ, అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై చర్చించడం, రికార్డులు నిర్వహణ తీరు పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆసక్తిగా ఆరా తీసి, ఎటువంటి రాజీ లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ కలెక్టర్ పి ప్రశాంతి సూచనలు చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో పరిశుభ్రత మెరుగ్గా ఉండాలని, రోజువారీ పరిశీలనతో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్శనలో ఆమె వెంట ఏఎన్ఎం రత్నం, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ఫస్ట్ రిఫరల్ యూనిట్ అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చిస్తూ, వైద్య ఆరోగ్య అధికారులకి, మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి కి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అయితే, కోవిడ్ అనంతరం ఈ యూనిట్ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించక పోతున్నదిగా, రోగుల రాక కూడా తక్కువగానే ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలను ఇతర అవసరమున్న ప్రాంతాల్లో వినియోగించేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. వైద్య సదుపాయాలు ప్రజలకు సులభంగా అందేలా చేసే విధంగా సేవల మళ్లింపు అవసరమైతే పరిశీలించాలన్నారు. ఈ మేరకు డి.ఎం.హెచ్.వో డా. కె. వెంకటేశ్వరరావు, ఎం.హెచ్.ఓ డా. వి. వినూత్న, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వైద్యాధికారి డా. శ్రీవల్లి, డిప్యూటీ డిఎం హెచ్ ఓ డా. సరితలతో సమావేశం నిర్వహించి, యూనిట్ అభివృద్ధి, సిబ్బంది వినియోగం, రోగుల అవసరాలపై సమీక్ష జరిపారు.

## అదృశ్యమైన మహిళను కనిపెట్టిన గండేపల్లి పోలీసులు




**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం సింగరం పాలెం గ్రామానికి చెందిన అనామిక అనే వివాహిత మహిళ ఈనెల 18వ తారీకున కనిపించకుండా వెళ్ళి పోయినది. దానిపై గండేపల్లి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ వైర్ కే శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి.బిందు మాధవ్ ఐపిఎస్ వారి ఆదేశాల మేరకు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు ఒక ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేసి అనేక ప్రయత్నాలు చేసి చివర కు సదరు వివాహిత మహిళను హైదరాబాదులో ట్రేస్ చేయడం జరిగిందని తెలిపారు.

## రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** యల్లమిల్లి మరియు యన్. టి.రాజాపురం గ్రామంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి పి.చంద్ర మౌళి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం అయినది ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరిలో ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు అంతేక పామాయిల్ మొక్కలు , మామిడి, జీడి మామిడి మొక్కలు గురించి ఉద్యాన శాఖ ద్వారా ఉన్న పథకాలను వివరించారు అంతే కాక డ్రిప్ మరియు స్ప్రింక్లర్ లను రాయితీ ఇస్తున్నామని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. అంతేకాక ఈ పంట నమోదు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని రైతులు, రైతు సేవా కేంద్రం ద్వారా ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాల్సిందిగా తెలియచేశారు. 100% రాయితీపై మినుము మరియు గట్ల మీద నాటుకోవ డానికి కందులు ఉన్నాయని అవసరమైన రైతులు రైతు సేవ కేంద్రంలోకి వచ్చి తీసుకువచ్చు అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ కంటిపూడి సత్యనారాయణ, సుంకవిల్లి సత్యనారాయణ, పెనుమర్తి భాస్కరరావు , దేవిశెట్టి బాబ్జీ , కె.శ్రీను , ఉదయ్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో “రక్తదాన శిబిరం”




**గండేపల్లి, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 30 జులై, 2025వ తేదీన కళాశాల ఎన్.ఎస్.ఎస్. మరియు యన్ సీ సీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో, కళాశాల ఇ సీ ఇ విభాగం వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాకినాడకు చెందిన డా.టి పీ అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ డా.పి. కృష్ణారావు మాట్లాడుతూ, తమ కళాశాల ఎన్.ఎస్.ఎస్. మరియు యన్ సీ సీ విభాగాల వారు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్,కాకినాడ వారు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో చేపట్టే వివిధ సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. తమ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం వారు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల వల్ల వివిధ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతోందని, అత్యవసర పరిస్థితుల లోనూ ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రక్తం వారిని ఆదుకుంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డా.జీ నరేష్ పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రాజశేఖర్ ఫణీంద్ర, వై విజయ్ కుమార్‌లు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లుగా మరియు కళాశాల విద్యార్థి కో ఆర్డినేటర్‌లు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం 129 మంది విద్యార్థులకు, అధ్యాపకులకు మరియు సిబ్బందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి 80 మంది నుండి రక్తమును సేకరించారు. రక్తదాన కార్యక్రమంలో సహాయ సహకారాలు అందిస్తున్న కళాశాల మేనేజ్మెంట్కు, సిబ్బందికి, సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న విద్యార్థులకు మరియు రక్తదానం చేసిన వారికి గవర్నమెంటు జనరల్ హాస్పిటల్, కాకినాడ వారు తమ కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ముగిసిన “ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్” ఆన్లైన్ సర్టిఫికేషన్ కోర్స్




**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ మరియు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన “ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్” ఆన్లైన్ సర్టిఫికేషన్ కోర్స్ విజయవంతంగా ముగిసింది. రిసోర్స్ పర్సన్ గా డా. ఆర్.వి.ఎస్. లలిత వ్యవహరించారు. ఈ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని ముఖ్యమైన అంశాలు అయిన క్యూబిట్స్, క్వాంటమ్ గేట్స్, డ్యాయ్చ్ అల్గోరిథం, గ్రోవర్ సెర్చ్ అల్గోరిథం వంటి విషయాలను సూత్రంగా అర్థం చేసుకోవడంతో పాటు ప్రాక్టికల్ డెమోలకు ప్రత్యేక్షంగా లబ్ధి పొందారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాస్ రెడ్డి ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన పెరిగిందని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డా.ఎం. బి. శ్రీనివాస్ , ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డా.ఎస్.రమాశ్రీ, ప్రో వైస్-ఛాన్సలర్ (ఇంజినీరింగ్ & సైన్సెస్) డా.ఏ.రమేష్, రిజిస్ట్రార్ డా.జి. సురేష్‌లు పాల్గొని కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కోఆర్డినేటర్ డా.ఐ. వీరాంజనేయులు మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు, ఇతర అధ్యా పకులు పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ఎంతో విజ్ఞానదాయకంగా ఫలప్రదంగా జరిగింది అని సంతృప్తి వ్యక్తం చేశారు.

## జగ్గంపేటలో సచివాలయం 3 ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక పద్మనాభ నగర్‌లో జగ్గంపేట సచివాలయం 48.6 లక్షలతో నిర్మాణం చేసిన సచివాలయాన్ని బుధవారం ఉదయం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులు మీదుగా ప్రారంభించారు. ముందుగా నూతన సచివాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే నెహ్రూకు నాయకులు అధికారు లు ఘనస్వాగతం పలికారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేటలో సచివాలయం మూడు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులను సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం పలు గదులను ఎస్ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండ బాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సత్తి సదాశివరెడ్డి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, సర్పంచ్ బచ్చల నాగరత్నం, కాంట్రాక్టర్ పాఠం శెట్టి లక్ష్మణ్ మూర్తి, (బుజ్జి) పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, జేఈ నారాయణమూర్తి, ఎండిఓ చంద్రశేఖర్, ఈవోపీఆర్డి భాస్కర్ రావు, పంచాయతీ సెక్రటరీ శివ, సిడిపిఓ పూర్ణిమ నండ్ల చిరంజీవి, రాయి సాయి, నేదురి గణేష్, కింగం రామకృష్ణ, మారిశెట్టి గంగ, రీసు రమణ, సాంబత్తులు చంద్రశేఖర్, కుప్ప తాతారావు, పలివెల ఏసు రాజు, ముక్క పాలు బాబు, అధికారులు, కుటమి నాయకులు పాల్గొన్నారు.